## ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై కనగర్తి రైతుల రాస్తారోకో



ప్రజాపక్షం/సుల్తానాబాద్: ఓదెల మండలం కనగర్తి గ్రామంలో శనివారం రైతులు రాస్తారోకో నిర్వహించి తమ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులు రోజుల తరబడి వడ్లు పోసి ఎదురుచూస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంటాలు వేయకపోవడం, భారదానా అందించకపోవడం, లారీలు సమయానికి రాకపోవడంతో వడ్లు కొనుగోలు ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద కళ్లాల్లో పోసిన వడ్లు ఎండకు ఎండిపోతూ నష్టపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.పలు రోజులుగా అధికారులకు సమస్య వివరించినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నిరసనగా రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టామని రైతులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ఏర్పాటు చేసి వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలని, లారీలు అందుబాటులో ఉంచి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

## మక్కల లోడింగ్, రవాణాలో జాప్యం లేకుండా వెంటనే చర్యలు



ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్: జిల్లాలో ధాన్యం, మక్కల కొనుగోళ్లు, లిఫ్టింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.శనివారం జూలపల్లి మండలంలోని వడ్కాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, జూలపల్లి మండల కేంద్రంలోని మక్కల (మొక్కజొన్న) కొనుగోలు కేంద్రాలను, అలాగే ధర్మారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న వరి ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు పరిస్థితులను, నిల్వలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద మక్కల లోడింగ్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని సూచించారు.రవాణా పరంగా వాహనాల కొరత సమస్య తలెత్తకుండా చూడాలని, లారీల లభ్యత తక్కువగా ఉన్నచో ప్రత్యామ్నాయంగా స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్లను ఉపయోగించుకొని మక్కల రవాణా వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం ధర్మారం మార్కెట్ యార్డును పరిశీలించిన కలెక్టర్.. కేంద్రాలకు వచ్చే ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు,రవాణా ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జూలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మ పోచాలు, జూలపల్లి తహశీల్దార్ దత్తు ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## గోవుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం: సిపి గౌష్ ఆలం



ప్రజాపక్షం/కరీంనగర్: రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. శనివారం కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాలులో విశ్వ హిందూ పరిషద్ (విహెచ్‌పి), బజరంగ్ దళ్, గోరక్ష ప్రముఖ్ తదితర హిందూ మత సంఘాల ప్రతినిధులతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి గౌష్ ఆలం మాట్లాడుతూ, పండుగ వేళ ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. పశువుల అక్రమ రవాణా లేదా గోవధకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా, తక్షణమే పోలీసులకు తెలియజేయాలే తప్ప చట్టాన్ని ఉల్లంఘించకూడదని హెచ్చరించారు. అలా కాదని చట్టాన్ని అతిక్రమిస్తే తెలంగాణ గోవధ నిషేధ, జంతు సంరక్షణ చట్టం ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు.

**గోవుల అక్రమ రవాణాపై పూర్తి నిషేధం... పటిష్ఠ నిఘా**

రాష్ట్రంలో గోవుల అక్రమ రవాణాను పూర్తిగా నిషేధించినట్లు సీపీ తెలిపారు. రవాణా చేసే పశువులకు సంబంధించి వెటర్నరీ డాక్టర్లు జారీచేసే 'ఫిట్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్' పత్రాలు తప్పనిసరిగా తనిఖీ చేస్తారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 121 చెక్‌పోస్టులు, 52 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయని.. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో కరీంనగర్ రూరల్ లోని ముగ్ధంపూర్, కరీంనగర్ కొత్తపల్లి మండలం చింతకుంట, చొప్పదండి మండలం ఆర్నకొండ, గంగాధర మండలం తుర్కాసినగర్, తిమ్మాపూర్ మండలం రేణికుంట, హుజురాబాద్‌లోని పరకాల క్రాస్ రోడ్డు వద్ద ప్రత్యేకంగా 6 చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, హిందూ సంఘాల పెద్దలు ఉట్కూరి రాధాకృష్ణ రెడ్డి, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు, రవాణా, అన్‌లోడింగ్‌కు భద్రత ఏర్పాట్లు: సిపి

ప్రజాపక్షం/సిద్దిపేట: సిద్దిపేట జిల్లాలో ధాన్యం కొనుగోలు, రవాణా, అన్‌లోడింగ్ కార్యకలపాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మీ పేరుమాల్ తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు సీజన్ దృష్టిలో ఉంచుకొని, రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండ ధాన్యం కొనుగోలు, రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు సిపి రశ్మీ పేరుమాల్ తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా ఐకెపి, ప్యాక్స్ కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. గుర్తించిన అన్ని కోనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధాన్యం అన్‌లోడింగ్ జరుగుతున్న రైస్ మిల్లులను కూడ పరిశీలించి ఏలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించారు. రైతులు ధాన్యం కొనుగోలు, రవాణ, అన్‌లోడింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాలను రవాణ మార్గాల వద్ద పోలీసులు నిరంతర అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు సీజన్ మొత్తం రైతులకు సురక్షితమైన వాతవారణం కల్పిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించేందుకు సిద్దిపేట పోలీసులకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

# బాధ్యత మరువను.. సమస్యలు పరిష్కరిస్తా



బతికేపల్లి అభివృద్ధికి ప్రత్యేక నిధులు
మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్

ప్రజాపక్షం/పెగడపల్లి: ధర్మపురి నియోజకవర్గ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, బాధ్యతాయుతంగా పని చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికే పల్లి గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 149 గ్రామాల్లో బతికేపల్లికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సుమారు 7 జనాభా ఉన్నా ఈ గ్రామం గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి దూరమైందని విమర్శించారు. స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి గ్రామంలో రోడ్లు, మురికి కాలువలు, మహిళా సంఘాల భవనాలు, కుల సంఘాల భవనాలతో పాటు పల్లె దావకాన వంటి మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం, మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని సుద్దపెల్లి, దోమలకుంట గ్రామాల్లో మహిళా సంఘాల వివో భవనాల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు అందించి వారి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటు అందిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా సుద్దపెల్లిలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో వివో భవనాలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మహిళా సంఘాలకు వివో భవనాలు నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, తహశీల్దార్ సయ్యద్ నిజామొద్దీన్, ఎంపీడీవో పి శశి కుమార్ రెడ్డి, సర్పంచులు ముంజ మహేశ్వరి మధుకర్, అయితర వేణి లక్ష్మ ణ్, బండారి మణెమ్మ శ్రీనివాస్,ఉప సర్పంచ్లు కస్తూరి పద్మ మల్లేశం, కస్తూరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడారి తిరుపతి, నాయకులు ఓరుగల శ్రీనివాస్, ఎలగొండ కృష్ణ హరి, సందీప్ మల్లారెడ్డి, వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

**ఆగమ పాఠశాలను సందర్శించిన మంత్రి:** మండలంలోని బతక పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న యతి రాజా చాత్తాద శ్రీవైష్ణము ఆగమ పాఠశాలను శనివారం సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మ ణ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పాఠశాల విద్యార్థులను ప్రతిభా పాటవాలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా మంత్రి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వేద విద్య అధ్యయనం ప్రతి విద్యార్థి శ్రద్ధగా అలవర్చుకోవాలన్నారు. వేద సంస్కృతి పరిరక్షణ ధ్యేయంగా ఆగమ పాఠశాల పనిచేస్తున్నాయన్నారు. అర్చకత్వంలో రాణించాలంటే, చిన్నప్పటినుంచి విద్యార్థులు తమ సృజనాత్మకతను నాగరాజు మహేంద్ర చార్య, నాగరాజు శ్రీనివాసచార్య, మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, మార్కండేయ దేవాలయ కమిటీ చైర్మన్ ఎలగొండ వెంకటరమణ, ఎలగొండ కృష్ణ హరి, మండల నాయకులు, పాల్గొన్నారు.



## పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ నిరసన



ప్రజాపక్షం/ వేములవాడ: వేములవాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఐ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి రాములు ఆధ్వర్యంలో నిత్యావసన పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలు, పెట్రోల్, డీజిల్, ధరలకు వ్యతిరేకంగా ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్యునికి నిత్యావసర సరుకుల ధరలు అందుబాటులో లేకుండా పోయాయని, సరుకులు కొనలేని పరిస్థితి వచ్చిందని, దీనికి తోడు, ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని సామాన్యుడు బతకలేని పరిస్థితి వచ్చిందని, తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంట నూనె, గ్యాస్, పెట్రోల్, డీజీల్ నిత్యావసర ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో వావిలాల. నర్సయ్య, తుపాకుల. ఎల్లయ్య, రాగుల. లింగం, కుమార్ తదితర సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం: ఎఐటియుసి

ప్రజాపక్షం/పెగడపల్లి : కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం ఐక్యంగా ఉండి,పోరాడి సాధించుకోవాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్ పిలుపునిచ్చారు. వెంగళాయిపేట భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భూమేశ్వర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వారి హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. బ్రిటిష్ కాలం నుండి కార్మికులు ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని 4 లేబర్ కోడ్‌లుగా మార్చడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ చర్య కార్మికులను మళ్లీ బానిసత్వంలోకి నెట్టడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి శనిగారపు ప్రవీణ్, మండల అధ్యక్షుడు రాచర్ల సురేష్, రాజేష్, సందరగిరి గోపి, తదితరులు పాల్గొన్నారు.

# మోదీకి కార్పొరేట్లపై ఉన్న ప్రేమ పేదలపై ఎదీ?

సిపిఐ కరీంనగర్ నగర కార్యదర్శి
కసిరెడ్డి సురేందర్ రెడ్డి
సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ
దిష్టి బొమ్మ దగ్ధం



ప్రజాపక్షం/కరీంనగర్: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపుతుందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి కార్పొరేట్లపై ఉన్న ప్రేమ పేద ప్రజలపై లేదని సీపీఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి ఆరోపించారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు శనివారం సీపీఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక కమాన్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఓడ ఎక్కేదాక ఓడ మల్లన్న ఓడ దిగినాక బోడ మల్లయ్య అనే చందంగా నరేంద్ర మోడీ వ్యవహారం ఉందని, ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్రం వంటగ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం వేసిందని, గతంలో వాణిజ్య గ్యాస్ ధర పెంచడంతో టీస్టాల్, టిఫిన్ సెంటర్లలో ధరలు పెంచారని, పేదలు కనీసం బయట టిఫిన్ చేయాలంటే భయపడే పరిస్థితి నెలకొందని అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ ఏకమై ఇరాన్‌పై చేసి యుద్ధం వల్ల అంతర్జాతీయంగా చమురు కొరత ఏర్పడే అవకాశం ఉందని విస్తృత ప్రచారం జరిగినా కేంద్రం మాత్రం అలాంటి పరిస్థితులు లేవని ప్రజలకు నమ్మబలికారని, అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ తగ్గినప్పుడు కూడా దేశంలో మోడీ ప్రభుత్వం చమురు ధరలు తగ్గించలేదని అన్నారు. కేంద్రం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని సురేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, మల్ల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,కొట్టె అంజలి, బామండ్ల పెల్లి యుగేందర్, బూడిద సదాశివ, నగర కార్యవర్గ సభ్యులు గామినేని సత్యం, బాకం ఆంజనేయులు, చెంచల మురళి, నూనావత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లతో ఆటో లాగి సిపిఐ నాయకులు నిరసన

ప్రజాపక్షం/పెద్దపల్లి: పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ గోదావరిఖని చౌరస్తా వద్ద సిపిఐ రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో శనివారం ఆటో ట్రాలీని తాళ్ళతో లాగి కేంద్ర ప్రభుత్వంపై సిపిఐ నాయకులు నిరసన వ్యక్తంచేశారు. అనంతరం సిపిఐ నగర కార్యదర్శి కే.కనకరాజ్, సిపిఐ నగర కార్పొరేటర్ మార్కపూరి సూర్యలు మాట్లాడుతూ ఇటీవల హైదరాబాదులో జరిగిన బిజెపి సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పొదుపు మంత్రం జపించిన కొన్ని రోజులకే పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచారని వారు విమర్శించారు. ధరల పెరుగుదల తో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజల మీద ఆర్థిక భారం పడుతుందని వారు పేర్కొన్నారు. ఈ మధ్యనే జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు చమురు, గ్యాస్ నిల్వలు దేశంలో అధికంగా ఉన్నాయని, అమెరికా ఇరాన్ యుద్ధం వల్ల మన దేశానికి ఎలాంటి నష్టం లేదని చెప్పి ఇపుడు కేంద్ర ప్రభుత్వం ధరలు ఎందుకు పెంచిందని వారు ప్రశ్నించారు. వెంటనే ధరలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మాటేటి శంకర్, తొడుపునూరి రమేశ్ కుమార్, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.లెనిన్, నాయకులు గొడిశల నరేశ్, కరీం, చంద్ర శేఖర్, సుధీర్, జగన్, ఆసాల నవీన్, కొమ్ము రాజయ్య,తదితరులు పాల్గొన్నారు.




# మక్కల కొనుగోలు వేగవంతం



పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ సందర్శన
ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట
విజయరమణా రావు

ప్రజాపక్షం/పెద్దపల్లి : మొక్కల కొనుగోలు వేగవంతం చేయాలని, రైతులు ఎట్టి పరిస్థితుల్లో ఆధ్వర్యంలో పడవద్దని, వడ్ల గింజ కటింగ్ లేకుండా రైతులకు న్యాయం చేసి వడ్లు కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శనివారం రోజునపెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వరి ధాన్యం మక్కలు కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూవేసవి కాలం ఎండ అధికంగా ఉందని దీంతో పాటు హమాలి కొరత కూడా కొంత ఉందని అన్నారు. ఐకెపి, సింగల్ విండోస్ సొసైటీ ద్వారా వరి ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయని ఈ వేసవిలో నాలుగున్నర మెట్రిక్ టన్నుల వరి పండినట్లు సివిల్ సప్లై అధికారులు లెక్కలు చెబుతున్నారని అధిక ఎండా కారణంగా మిల్లులో దిగుమతికి కొంత సమయం పడుతుందని అన్నారు. మే 25వ తేదీ వరకు మూడున్నర లక్షల టన్నుల వరి ధాన్యం కొనాలని ప్రభుత్వం ,జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు కూడా దృష్టి పెట్టి పనిచేయడం జరుగుతుంది అన్నారు. ఈ నియోజకవర్గంలో మొక్కజొన్నలు కూడా 11 సెంటర్లో రైతులను తీసుకోవడం జరుగుతుందని, మొక్కజొన్న రైతులు కూడా అధైర్య పడవద్దని ఒక గింజ లేకుండా జొన్నలు కొనడం జరుగుతుంది అన్నారు. మొక్క జొన్న రైతులు గన్ని సంచులు కొనుక్కుంటే ప్రభుత్వం గన్ని సంచుల ఒక్కొక్కరికి 21 రూపాయిలు ఆ తదుపరి ఇస్తుందని సెంటర్ ఇన్‌చార్జ్ నిర్వహణ ఖాతాలో వేస్తుందని వారు గన్నీ సంచులు కొనుక్కున్న రైతులకు ఇస్తారు అన్నారు. ప్రభుత్వం మొక్కజొన్నలకు రూపాయలు 2400 మద్దతు ధర ఇస్తుంది అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న రాధాంతాలు రైతులు నమ్మవద్దు అన్నారు. చుట్టు ప్రక్కల వరి ధాన్యం కటింగు ఉందని మన నియోజకవర్గంలో లేకపోవడంతో ప్రతిపక్షాలు ఏదోరకంగా ఎన్ని రాజకీయ కుట్రలు చేసిన రైతులు పట్టించుకోకూడదు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు మరియు పలు గ్రామాల సర్పంచ్లు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులు సన్నరకం ధాన్యం పండించాలి

కలెక్టర్ కె. హైమవతి



ప్రజాపక్షం/హుస్నాబాద్: వచ్చె ఖరీఫ్ సీజన్‌లో ప్రతిరైతు సన్నరకం వరి ధాన్యం పండించేందుకు ముందుకు రావాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే హైమవతి రైతులకు పిలుపు నిచ్చారు. శనివారం కలెక్టర్ హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ కమీటి గోదాంలోని వరి ధాన్యం దిగుమతి ప్రక్రీయను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌కమీటిలో 5 వేల మెట్రిక్ టన్నుల గోదాం లో 2 గోదాములలో హుస్నాబాద్ అక్కన్నపేట మండలాలకు చెందిన వరి ధాన్యం దిగుమతి చేస్తున్నమని తెలిపారు. ఒక గోదాంలో నిండిన అనంతర మరో గోదాంలోని గన్ని సంచులకు మరో గోదాంలోకి తరలిచి ఇందులో ధాన్యం నిలువ చేయాలని కొరారు. ఇక్కడి మార్కెట్‌లో పని చేసే కూలీలు ఇక్కడే పని చేసే విధంగా సూచుకొవాలని చైర్మెన్ తిరుపతిరెడ్డిని ఆదేశించారు. ఖరీఫ్‌సీజన్‌లో ప్రతిరైతు సన్నరకం వరి ధాన్యం పండిస్తే రైతులకు బోనస్ తో పాటు మన జిల్లాకు సరిపడే ధాన్యం పండుతుందని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డివో రాంమూర్తి, ఏసీపి సదానందం, తహశీల్దార్ లక్ష్మారెడ్డి, మార్కెట్ చైర్మెన్ తిరుపతిరెడ్డిలు తదితరులు పాల్గోన్నారు. అనంతరం పందిల్ల లోని రైస్ మిలుల్లను సందర్శించి ఎగుమతి దిగుమతి ప్రక్రీయన పరిశీలించి రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండ ఎప్పటికప్పుడు అన్‌లోడింగ్ చేసుకోవాలని మిల్లర్లును కోరారు.

**రోడ్డు విస్తరణ పనుకు పరిశీలించిన కలెక్టర్**

హుస్నాబాద్ నుండి కొత్తపెల్లి వరకు 77.20కోట్లతో చేపడుతున్న నాలుగు వరుసల రోడ్డ నిర్మాణం పనులను జిల్లా కలెక్టర్ కే హైమవతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు వెంట ఉన్న కరంటు స్థంబాలను చెట్లను , పొదలను వెంటనే తొలగించాలని గుత్తేదారుకు సూచించారు. రోడ్డుప్రక్కన ఉన్న ఇండలను మార్కింగ్ ఇచ్చి వాటిని తోలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.రోడ్డు పనులను వేగం పెంచి నాణ్యత ప్రమానాలు పాటిస్తు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డివో రాంమూర్తి, తహశీల్దార్, లక్ష్మారెడ్డి, విద్యుత్ డి ఈ తదితరులు పాల్గోన్నారు.

## రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం /కథలాపూర్ : జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు మరియు మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా శనివారం కథలాపూర్ మండలంలోని సిరికొండ గ్రామంలో ఉన్న కొత్త సురేష్, జి.కె.ఎస్ మరియు అమీర్ రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మిల్లులలో ధాన్యం నిల్వలు,మిల్లింగ్ ప్రక్రియ, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు.ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, మిల్లుల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు.అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, మిల్లింగ్ పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని మిల్లర్లకు సూచించారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ధాన్యం నిర్వహణ చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి,ఎంఆర్వో రమేష్,డీటిసీస్ ఉమాపతి,ఎఫ్ఐ రాజేందర్ రావు, ఆర్ఐ రవీందర్,జిపివో లు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## చేతికొచ్చిన వరి పంట ప్రమాదవశాత్తు దగ్ధం



ప్రజాపక్షం/మల్లాపూర్ : ఎంతో కష్టపడి పండించిన వరి పంట చేతికొచ్చే సమయానికి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి ఇద్దరు రైతులకు చెందిన వరి పంట పూర్తిగా దగ్ధమైంది. మండలంలోని కొత్త దామరాజు పల్లి గ్రామానికి చెందిన గడసంద జగదీష్ ,నేదురి రాములు కు చెందిన ఎకరం వరి పంట శనివారం అగ్ని ప్రమాదం సంభవించగా మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ కాళీ బూడిదయింది.ఉన్న కొద్దిపాటి పొలం అగ్నికి ఆహుతవగా ఆర్థికంగా నష్టపోయామని ప్రభుత్వం పరంగా నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు వాపోతున్నారు.

# అవినీతి అడ్డాగా నిర్మల్ జిల్లా!

శాఖోపశాఖలుగా విస్తరించిన
అక్రమాల నెట్‌వర్క్
పెరుగుతున్న అవినీతి గ్రాఫ్,
గడిచిన ఏడాది కాలంగా అదే తీరు

ప్రజాపక్షం / నిర్మల్ : నిర్మల్ జిల్లాలో అవినీతి మహమ్మారి రోజు రోజుకూ, పెచ్చుమీరిపోతోంది. గడిచిన 12 నెలల్లో జరిగిన అవినీతి కేసులను ఒకసారి పరిశీలిస్తే జిల్లాలో అవినీతి తగ్గకపోగా మరింత పెట్రేగిపోతుందనే నగ్నసత్యం స్పష్టమవుతోంది. ఏసిబి అధికారులు వరుసగా దాడులు చేస్తూ అవినీతిపరుల భరతం పడుతున్నా అధికారుల తీరులో మార్పు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం మొదలుకొని మారుమూల మండలాల రెవెన్యూ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల వరకు ప్రతి పనికి ఒక ధర నిర్ణయించి మరీ వసూళ్ళకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ఎన్ని పారదర్శక సంస్కరణలు తెచ్చినా, క్షేత్ర స్థాయిలో ఉన్న కొందరు అధికారులు వాటిని కూడా ఆదాయ మారాగ్లుగా మార్చుకుంటూ సామాన్యులను పీడిస్తున్నారు. ఈ ఏడాది కాలంలో బయటపడిన ఉదంతాలు జిల్లా యంత్రాంగంలో వ్యవస్థ ఎంతలా కుళ్ళిపోయిందో కళ్ళకు కడుతున్నాయి.



## మున్సిపాలిటీలో 'పర్మిషన్ల దందా !

నిర్మల్ మున్సిపాలిటీలో ముఖ్యంగా పట్టణ ప్రణాళిక విభాగం అవినీతికి నిలయంగా మారింది. కొత్త ఇళ్ళ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలన్నా లేదా అపార్ట్‌మెంట్ ప్లాన్లు మంజూరు చేయాలన్నా అధికారులు నిబంధనల కంటే ముడుపులకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక్కడ మరో విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే, కార్యాలయంలోని అధికారుల కంటే బయట తిరిగే ప్రైవేటు వ్యక్తుల హవానే ఎక్కువగా కనిపిస్తోంది. ఒకఫైలు ముందుకు కదలాలంటే ఈ మధ్యవర్తుల ద్వారానే బేరసారాలు సాగుతున్నాయి. గతంలో అనేకమంది మున్సిపల్ సిబ్బంది ఏసిబికి చిక్కినప్పటికీ, మిగతా వారి తీరులో మార్పు రాకపోవడం, ఆశ్చర్యం కలిగిస్తోంది. సామాన్యులు తమ సొంత ఇళ్ళకోసం నెంబర్లు తీసుకోవాలన్నా ఆస్తి పన్ను మార్పిడి వంటి పనులు చేసుకోవాలన్నా నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉంది. డబ్బులు ఇస్తే నిమిషాల్లో జరిగే పినిని ఇవ్వక పోతే వేల కొంద్ది కొర్రీలు వేస్తూ కాలయపన చేస్తున్నారు.

## మండలాల్లో రెవెన్యూ, పోలీస్ అరాచకాలు

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ శాఖ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. నిర్మల్ రూరల్, సారంగాపూర్, లక్ష్మణచాంద, కుంటాల వంటి మండలాల్లో భూముల సర్వే మరియు హద్దుల నిర్ధారణ కోసం రైతులను నిలువు దోపిడి చేస్తున్నారు. సర్వేకోసం వచ్చే అధికారులు క్షేత్రస్థాయికి వెళ్ళె ముందే ఇంత ఇస్తారా అని బేరం కుదుర్చుకుంటున్నారు. మొన్నటికి మొన్న నిర్మల్ రూరల్ పరిధిలో ఒక సర్వేయర్ లంచం తీసుకుంటూ పట్టుబడటం ఇందుకు సజీవ సాక్ష్యం రైతులు తమ కష్టార్జితాన్ని భూమి రికార్డుల సవరణ కోసం అధికారుల పాలు చేయాల్సి వస్తోంది. ఇదే తరుణంలో పోలీస్ శాఖలోనూ కొందరు అధికారులు తమ విధులను విస్మరించి సివిల్ సెటిల్మెంట్లలో తలదూర్చుతున్నారు. మామడ మండలంలో ఒక ఎస్.ఐ. ఏసిబికి దొరికిపోవడం జిల్లా పోలీసు ప్రతిష్ఠను దారుణంగా దెబ్బతీసింది. బాదితుల నుంచి లక్షల్లో డిమాండ్ చేస్తూ కేసులు మాఫీ చేస్తామన్న వాగ్దానాలతో అక్రమ సంపాదనకు తెరలేపుతున్నారు.

## ప్రక్షాళన దిశగా అడుగులు పడాల్సిందే

ఉపాధ్యాయుల సర్వీస్ రికార్డుల క్రమబద్దీకరణ నుంచి బదిలీల వరకు ప్రతిదానికి ధరలు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏసిబి దాడులు పెరగడంతో కొంద అధికారుల్లో వణుకు మొదలైనప్పటికీ, మరికొందరు పట్టుబడతారేమోననే భయంతో సెలవుల పై వెళ్తున్నారు. జిల్లాలో ఈ అవినీతి అంతం కావాలంటే కేవలం దాడులు మాత్రమే సరిపోవు.పర్యవేక్షణ చేయడంతో పాటు, పారదర్శకమైన ఆన్‌లైన్ వ్యవస్థను పటిష్ఠం చేయాలి, ప్ర జలు కూడా లంచం ఇవ్వకుండా ప్రతిఘటించి, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఏసిబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు సమాచారం ఇవ్వాలి. చైతన్యంతోనే నిర్మల్ జిల్లాలో ఈ లంచాల పర్వానికి చరమగీతం పాడటం సాధ్యమవుతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# డెంగ్యీ వ్యాది పట్ల అప్రమత్తం

జిల్లా వైద్యాదికారి శ్రీరాం



ప్రజాపక్షం/రామాయంపేట: వర్షాకాలం సమీపిస్తునన తరుణంలో డెంగ్యీ వంటి సీజనల్ వ్యాదుల పట్ల అధికార యంత్రాంగం, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాదికారి శ్రీరాం అధికారులను ఆదేశించా రు. శనివారం రామాయంపేట ఆసుపత్రికి వచ్చిన ఆయన వైద్యాదికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.వర్షాకాలం సన్నద్దతలో బాగంగా దోమల ఉత్పత్తి స్థానాలను ముందుగానే గుర్తించి వాటిని నిర్మూలించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. డెంగ్యీ నివారణకు చర్యలను వేగవంతం చేయాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా డెంగ్యూ వ్యాప్తి చెందడానికి ఎక్కువ అవకాశం ఉన్న హైరిస్కు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అలాగే పసిపిల్లలు, గర్బీణీలు, వృద్దులకు వ్యాది సులభంగా వ్యాపిస్తుందని వారి పట్ల మరింతగా బాద్యతగా ఉండాలన్నారు. ఆసుపత్రిలో డెంగ్యీ నివారణకు అవసరమైన ఆర్డీటీ కిట్లతో పాటు అన్ని రకాల అత్యవసర మందులను ఎల్లప్పుడు అం దుబాటులో ఉంచాలని అధికారులకు మార్గదర్శకాలను జారీ చేశారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ లింబాద్రి, డి.దర్మారం వైద్యులు వైశాలితో పాటు సిహెచ్‌సి, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

# చట్టాలపై మహిళలు అవగాహన




ప్రజాపక్షం/శివ్వంపేట : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ సహాయ న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, లీగల్ సర్వీస్ న్యాయవాది కాత్రోత్ రాజునాయక్‌లు అన్నారు. శనివారం మండలంలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో మహిళా సంఘాలకు న్యాయ విజ్ఞాన సదస్సు సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సహాయ న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, లీగల్ సర్వీస్ న్యాయవాది కాత్రోత్ రాజునాయక్‌లు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, వాణిజ్య దోపిడి నిరోధక పథకం 2015 కింద బాధితులకు అందే న్యాయ సహాయయం, రక్షణ చర్యలు, ప్రభుత్వ పునరావాస అవకాశాలను వివరించారు. జాగృతి పథకం 2025లో భాగంగా సురక్షిత్ బచ్‌పన్‌సురక్షిత్ భవిష్యత్ కార్యక్రమం ద్వారా చిన్నారుల రక్షణ, ఫోక్సో చట్టం నిబంధనలు, బాలల హక్కుల పరిరక్షణపై ప్రజలందరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు.గ్రామ సర్పంచ్ నవీన్, ఐకేపీ ఏపీఎం పెంటాగౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి నర్సమ్మ, జిల్లా మాజీ ఐకేపీ అద్యక్షురాలు నవనీత, డ్వాక్రా మహిళలు, లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గాలంటే జిఎస్‌టిని ఎత్తివేయాలి

ప్రజాపక్షం/నిజామాబాద్ : పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గాలంటే కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టిని ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శిపి.సుధాకర్, మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ అన్నారు. శనివారం కోటగిరి మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని బస్టాండ్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆటోను తాడుతో లాగి నిరసన తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవని (పెరగవని కరెక్ట్) చెప్పిన పిఎం మోడీ ప్రస్తుతం క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయని పెట్రోల్, డీజిల్ ధరలను సుమారు 3 రూపాయలు పెంచటం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వంలో రూ.300 ఉన్న గ్యాస్ ధర బిజెపి హయంలో వెయ్యి రూపాయలకు పై చేరుకోవటంతో పాటు ప్రజలకు 45 రోజులు గ్యాస్ దొరికే పరిస్థితి లేదన్నారు. కమర్షియల్ గ్యాస్ దొరకకపోవటంతో చిరు వ్యాపారులు హోటళ్లు మూసివేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. దేశంలో కార్పోరేట్ సంస్థలకు సబ్సిడీలు పెంచి పేదలపై ప్రత్యక్ష భారాలు మోపడం సరికాదని ధ్వజమెత్తారు. బిజెపి హయాంలోనే పెట్రోల్, డీజిల్, గ్యాస్‌పై జిఎస్‌టితెచ్చిందని పెట్రోల్, డీజిల్‌పై జీఎస్‌టిని ఎత్తివేస్తేనే ధరలు తగ్గుతాయని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గంగాధర్, నీలి శంకర్, రాజు, రాములు, హన్మాండ్లు, అన్సర్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.


# ప్రజల సహకారంతోనే... నేరనియంత్రణ సాధ్యం



ప్రజాపక్షం/చెన్నూరు : ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే నేర నియంత్రణ సాధ్యమవుతుందని చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ అన్నారు. శనివారం రోజున చెన్నూరు పట్టణం కొత్తగూడెం కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. కాలనీలో గుడుంబా అమ్మకాలు, అసాంగీక కార్యకలాపాలపై ఆరా తీస్తూ కాలనీలో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 65ద్విచక్ర వాహనాలు,5ఆటోలను సీజ్ చేశారు.నేర చరిత్ర కలిగిన, అనుమానాస్పద వ్యక్తులు కాలనీలో ఆశ్రయం పొందినా వెంటనే తమకు సమాచారం అందించాలని,యువత మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. కాలనీలో స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేర నియంత్రణలో పోలీసులకు సహకరించాలని సీఐ బన్సిలాల్ కోరారు.

# మొక్కజొన్న కొనుగోలు వెంటనే చేపట్టాలి

ప్రజాపక్షం /జన్నారం : మొక్కజొన్న పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ జన్నారం మండలంలోని రోటి గూడ గ్రామానికి చెందిన రైతులు శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రోటి గూడ గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న (మక్కలు) పోసి నెల రోజులుగా గడుస్తున్నప్పటికీ అధికారులు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటను కొనుగోలు కేంద్రంలో ఉంచి రోజులు గడుస్తుండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. రైతులు తహసీల్దార్ బక్కయ్యను స్వయంగా సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు.



# అమర కమ్యూనిస్టు అబ్రహం,మునీర్

ఇరువురికీ ఘన నివాళి మే 25న మందమర్రిలో మహాసభకు పిలుపు పార్టీలకు అతీతంగా అందరికీ ఆహ్వానం




ప్రజాపక్షం/మందమర్రి : మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని ఎఐటియుసి యూనియన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అమర కమ్యూనిస్టు వాది, ప్రముఖ పాత్రికేయుడు కామ్రేడ్ ఎండి మునీర్ ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు నాయకులు ప్రకటించారు.ఈనెల 25వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు మార్కెట్ ప్రాంతంలోని వీటి అబ్రహం గ్రౌండ్‌లో వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించి కార్యక్రమ వివరాలను వెల్లడించారు.నాయకులు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల కోసం నిరంతరం పోరాడిన అమరజీవులు కామ్రేడ్ వీటి అబ్రహం మరియు ఎండి మునీర్ సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, కార్మిక హక్కుల సాధనకు,పేదల పక్షాన వారు చేసిన పోరాటాలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి ఆశయాలను భావితరాలకు చాటిచెప్పేలా బహిరంగ స భను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా ప్రముఖ ప్రజా నాయకుడు వాసిరెడ్డి సీతారామయ్యతో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రెస్‌మీట్‌లో శైలేంద్ర సత్యనారాయ ణ, భీమనాథుని సుదర్శనం,ప్రముఖ అడ్వకేట్ ఎండి సందాని, గూడూరు యాదిరెడ్డి, శతకోపం కిష్టయ్య, ఎండి అబ్బాస్,బర్ల సదానందం, ఊరకొండ రాజశేఖర్, ఎగేటి రాజేశ్వరరావు, దొంతుల రాజం, కలవల శ్రీనివాస్, పారిపెల్లి సం జీవ్, ములకలపల్లి వెంకటేశ్వర్లు, సట్ల కొండయ్య, శివాజీ శ్రీనివాస్,పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.ఈ వర్ధంతి సభ పార్టీలకు, యూనియన్లకు అతీతంగా నిర్వహించబడుతోందని, ప్రజా ఉద్యమాల పట్ల అంకితభావం ఉన్న ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనని స్పష్టం చేశారు.

# పెట్రోల్, డీజిల్ చార్జీలు తగ్గించాలి

సిపిఐ ఆధ్వర్యంలో ఆటో లాగుతూ నిరసన




ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ చార్జిలు తగ్గించాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.ఓమయ్య అన్నారు. శనివారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుండి టూరిజం హోటల్, బస్టాండ్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు ఆటోను లాగుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ చార్జిలు తగ్గించాలని నిరసన ర్యాలీ నిర్వహించారు.ప్రధాని నరేంద్ర మోడీ ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం జరిగిన భారతదేశానికి ఎటువంటి నష్టం వాటిల్లదని ఆరునెలల పైచిలుకు పెట్రోల్, డీజిల్ నిలువలు ఉన్నాయని ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదని మాయ మాటలు చెప్పి ఈరోజు కొంతమంది బడా వ్యాపారస్తులకు లాభాలు చేకూర్చడానికి భారతదేశంలో పెట్రోల్ డీజిల్ నిలువలను తక్కువ చూపిస్తూ రేట్లు పెంచటం దుర్మార్గం అన్నారు.పార్టీ జిల్లా నాయకులు అనిల్, పిన్నెల హనుమాండ్లు, సురేష్, ఫిరోజ్, గోవర్ధన్, రంజిత్, ప్రసాద్, భానుచందర్, మహేశ్, సలీం, సత్యనారాయణ పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

ఎఐవైఎఫ్ డిమాండ్

ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్: కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.3 చొప్పున పెంచడాన్ని నిరసిస్తూ శనివారం ఏఐవైఎఫ్ ఆదిలాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ చౌక్ నుండి బాబు జగజ్జీవన్ రామ్ చౌక్ వరకు మోటార సైకిళ్లను తాడుతో లాగుతూ వినూత్నంగా నిరసన తెలిపారు.కేంద్ర ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్లే దేశంలో చమురు సంక్షోభం ఏర్పడిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో గత పదేళ్లుగా క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ చమురు కంపెనీలు లాభాలు గడించాయని, ఇప్పుడు రెండు నెలల నష్టాల పేరుతో ఇంధన ధరలను పెంచడం తుగ్లక్ చర్య అని విమర్శించారు. అంతర్జాతీయ ఒత్తిళ్లకు తలొగ్గి రష్యా నుండి చమురు కొనుగోలును తగ్గించడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల కోసమే పనిచేస్తోందని ఆరోపించారు. ధరలను అదుపు చేయకుంటే ప్రజల నుండి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఆకాష్, గజానంద్, రవి, బాబు, హరీష్, రావేష్ పాల్గొన్నారు.



# చిన్నారులలో సృజనాత్మకత ఆవిష్కరించిన బాలభవన్

కలెక్టర్ ఇలా త్రిపాఠి






ప్రజాపక్షం/నిజామాబాద్ : చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ వారిలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు బాలభవన్ ఆధ్వర్యంలో వేసవిలో నిర్వహిస్తున్న శిణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తున్నాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రశంసించారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని బాలభవన్‌లో శనివారం 'కళావైభవం కలర్స్ ఆఫ్ చైల్డ్ హుడ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర మేయర్ ఉమారాణి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. బాలభవన్‌లో శిక్షణ పొందుతున్న బాలబాలికలు తమ సృజనాత్మకతను చాటుతూ అందంగా ఆకట్టుకునే రీతిలో తయారుచేసిన కళాకృతులు, ఎంతో హృద్యంగా గీసిన కళాకృతులను ఆసక్తితో తిలకించారు. చక్కటి పెయింటింగ్స్ గీసిన 7వ తరగతి విద్యార్థి సాయి రుధిర్ కళా నైపుణ్యాన్ని కలెక్టర్ మెచ్చుకుంటూ చిన్నారికి బహుమతిని అందించి ప్రోత్సహించారు. పేరిణి, కోలాటం, నృత్యాలతో అలరింపజేసిన చిన్నారులను, వెంట్రిలాక్విజంతో ఆకట్టుకున్న జాదూ యుగంధర్ రంగనాథ్‌ను సైతం కలెక్టర్ ప్రశంసించారు. ప్రస్తుత వేసవి శిక్షణ తరగతులలో బాలభవన్‌లో 720 మంది చిన్నారులకు ప్రవేశాలు కల్పించగా వారికి శాస్త్రీయ సంగీతం, నృత్యం, మిమిక్రీ, కర్రసాము, డ్రాయింగ్, యోగా, మ్యాజి తదితర 30 అంశాలలో అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలపై నిర్వాహకులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలభవన్ ద్వారా చక్కటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అధికారులను అభినందించారు. పిల్లల్లోని సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని, వారికి ఇష్టమైన అంశాలలో తర్ఫీదునివ్వటంతో నైపుణ్యాలు మెరుగవుతాయన్నారు. డీఈఓ అశోక్, సూపరింటెండెంట్ ఉమాబాల, మాజీ పర్యవేక్షకులు రాఘవేందర్ పాల్గొన్నారు.

# జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



ప్రజాపక్షం/రామాయంపేట: జనగణన 2027లో బాగంగా సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని దీంట్లో ప్రతి ఒక్కరు భాగస్వాములై సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శనివారం రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో జనగణన 2027 ఇండ్ల లెక్కింపు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించి ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షించారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు ఖచ్చితమైన సమాచారం అందించాలన్నారు. సేకరించిన వివరాలన్నీ గోప్యంగా ఉంటాయని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అనుభవజ్ఞులైన సిబ్బందిని జనగణన సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లుగా నియమించి వారికి అవసరమయ్యే శిక్షణ అందించడం జరిగిందన్నారు. ఈనెల 11 నుండి జూన్ 9 వరకు జరిగే ఇండ్ల గణన సర్వేను పారదర్శకంగా నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ఎన్యుమరేటర్లను ఆదేశించారు. డిప్యూటి తహశీల్దార్ నవీన్, ఆర్ఐలు గోపి, సర్పంచు బక్కయ్యగారి యాదగిరి, ప్రసాద్‌తో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్ అంధకారం

మత్తు పదార్థాల వినియోగంతో..

పోలీసు కమిషనర్ సాయి చైతన్య

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : మత్తు పదార్థాల వినియోగం వలన యువత భవిష్యత్తు నాశనం అవుతుందని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్న నేపథ్యంలో నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో జిల్లా పోలీసుశాఖ, ఈగల్ టీం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, కుటుంబ భవిష్యత్తు పై దృష్టి పెట్టాలన్నారు. ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా తమ పరిసరాల్లో ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.అదనపు డిసిపి (ఏ.ఆర్.) రామ్ చంద్రరావు, నిజామాబాద్ ఏసిపి ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, ఈగల్ టీం డిఎస్‌పి ఎం. సోమనాథం, హోమ్‌గార్డ్ ఏసిపి దీపక్ చంద్ర, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్ రెడ్డి, నిజామాబాద్ టౌన్ సిఐ శ్రీనివాస్ రాజ్, సౌత్ రూరల్ సిఐ ఎన్.సురేష్ కుమార్, నార్త్ రూరల్ సిఐ బి. శ్రీనివాస్, డిచ్‌పల్లి సిఐ కె. వినోద్, ధర్పల్లి సిఐ భిక్షపతి, నిజామాబాద్ డివిజన్ ఎస్‌హెచ్‌వోలు, ఎస్ఐలు పాల్గొన్నారు



# కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు

ప్రజాపక్షం /సిర్పూర్(టి) : సిర్పూర్(టి) మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం రోజున నిర్వహించిన కార్యక్రమంలో 47 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కులను సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్ 2వ తేదీ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోని అర్హులైన లబ్ధిదారులు తమ తమ ఎంపీడీవో కార్యాలయాలలో దరఖాస్తులు సమర్పించుకోవాలని సూచించారు.అలాగే సిర్పూర్(టి) మండలంలోని చింతకుంట గ్రామంలో నూతన 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.ఈ సబ్ స్టేషన్ ఏర్పాటు ద్వారా చింతకుంట, చుంచుపల్లి, హీరాపూర్, భూపాలపట్నం,కేశవపట్నం,ఆచెల్లి తదితర గ్రామాలలో నెలకొన్నలో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.ఎంపీడీవో సత్యనారాయణ,ఆర్ఐ స్వప్న,ప్రవీణ్, సర్పంచులు నాగమణి, రజిని, వడాయి తాను భాయ్,ఉప సర్పంచ్‌లు దుర్గం ప్రశాంత్,శేఖర్,నాయకులు నానయ్య, మహేష్, బనర్కర్ సాయి,ఎలుములే శంకర్,శ్రీనివాస్ గౌడ్, బాపు, రవి,సంతోష్ ,రమేష్,తిరుపతి,పాల్గొన్నారు..



